కథానిక

# పార్వతి కన్న కల

కె. రామలక్ష్మి

కొంటెపిల్ల అనిపించుకుంటూనే పార్వతి పెరిగి పెద్దది అయింది. పెళ్ళయిన ఆరునెలలలోనూ పదిసార్లయినా దెబ్బలాడింది కృష్ణమూర్తితో. పదిసార్లేనా పుట్టింటికి వచ్చి వెళ్ళింది. ఈ హడావిడంతా చూసి కృష్ణమూర్తి అన్నాడు "నువ్వు కొంటెపిల్లవు పార్వతీ"అని. కృష్ణమూర్తి అలా అంటే పార్వతికి కోపం రాలేదు. సంతోషించింది. దీనికి కాకపోయినా, యిలాటి వాటికే ఎన్నింటికో కోపం (ఉడుకుబోతుతనం) వచ్చి కృష్ణమూర్తితో దెబ్బలాడింది పార్వతి. పార్వతికి మరీ కోపంరాడానికి ముఖ్యకారణం కృష్ణమూర్తికి కోపం ఓ పట్టాన రాకపోవడం. పార్వతి ఏమన్నా కృష్ణమూర్తి చిలిపిగా నవ్వేస్తాడు. లేకుంటే ముభావుగా సమాధానం చెప్తాడు. పార్వతి ఎందుకో తెలియని ఉత్సాహంలో సంతోషంగా వుండడం చూసి "ఈ ఆర్నెల్లలో ఎంత విసిగించావు నన్ను!" అన్నాడు కృష్ణమూర్తి. దాంతో ముందు పార్వతికి కోపంవచ్చింది ఈ ఆర్నెల్లలో అతనికోసం తనెన్ని త్యాగాలు చేసిందో ఆ కోపంలో ఏకరువు పెట్టింది. కృష్ణమూర్తి నవ్వేడు. నవ్వి వూరుకోలేదు. "ఆ లెఖ్ఖన నా త్యాగాలు లెక్కపెట్టడానికి యిక్కడ మా అమ్మేనా వుంటే బాగుండేది. నువ్వు నీ తరఫునా నా తరఫునాకూడా వుండడం నాకు నచ్చలేదు!" అన్నాడు.

"అయితే నే నెందుకూ యిక్కడ; నన్ను మావాళ్ళింటికి పంపించెయ్యండి" కంఠం దుఃఖంతో ఒణికిపోతూంటే అంది పార్వతి. అంతట్లోనే ఆమెకి అంత ఏడుపెలా వచ్చిందా అని నవ్వేడు కృష్ణమూర్తి. అదిచూసి పార్వతి భర్తల దౌర్జన్యాలను గురించీ, మొగవాళ్ళ హృదయంలేని ప్రవర్తనలగురించీ ఉపన్యసిస్తూనే, మధ్యమధ్యని అడిగింది- "పెట్టెసర్దుకుంటాను యీవాళ నన్ను పంపించెయ్యండి" అని.

"నే ఉద్యోగం వదిలేసిరానా?" అన్నాడు.

"నాకేం అంత చేతకాదనుకోకండి. మీరేం రానక్కరలేదు. మీరు ఉద్యోగం మానెయ్యక్కరలేదు. మీరు మానేస్తే యింకేమేనాఉందా? దేశం శత్రువులు దోచుకుంటారు!" చివరిమాటలు హేళనగా అంది పార్వతి. పార్వతికి మిలిటరీ ఉద్యోగం అంటే అసహ్యం. అయినా కృష్ణమూర్తి కోసం ఆ ఉద్యోగాలంటే యిష్టం అలవరచుకొంది. కాని కృష్ణమీద కోపం వచ్చినప్పుడల్లా అతని ఉద్యోగాన్ని అవహేళన చేస్తుంది. కృష్ణమూర్తి నవ్వుతూ "ఉద్యోగాన్నెందుకూ ఆడిపోసుకుంటావు? దాని ధర్మమా అంటూ నెలకి ఏడొందలొస్తున్నాయి. అవేలేకుంటే నువ్విలా వుండకలవా? పోనీ నన్నే అనకూడదూ?" అంటాడు.

పార్వతి లోపలికి వెళ్ళిపోయాక ఆలోచించి చూశాడు కృష్ణమూర్తి. ఎప్పుడూ పార్వతే గెలుస్తూంది. ఈమాటేమైనా సరే పుట్టింటికి పంపించకూడదు. ఏంచేస్తుందో చూడాలి. రెండు రోజులు కోపంగా ఉంటుంది. మూడోనాడు మామూలే. పార్వతికి కోపంవస్తే బాగుంటుంది. ఆ కోపంలో తనముఖం ఎలావుంటుందో పార్వతికి తెలియదు. కృష్ణమూర్తికి తెలుసు!

ఆవాళ ఆదివారం. హాయిగా సాయంత్రం ఎక్కడికేనా పోకుండా పార్వతితో కజ్జా పెట్టుకున్నాడు. అయినా సాయంత్రానికి కోపం అదేపోతుంది అని మధ్యాహ్నం అంతా నిద్రపోయాడు. సాయంత్రానికీ పార్వతికి కోపం పోలేదు. సరికదా ఎక్కువయింది. మధ్యాహ్నంకృష్ణమూర్తి నిద్రపోతూంటే తన బట్టలూ పుస్తకాలూ అన్నీ సర్దుకుంది, ఏడూనలభై బండిలో అమ్మగారింటికి వెడదామని. కాని కృష్ణమూర్తి ఉలక లేదు పలక లేదు. తన ఆత్మగౌరవాన్ని తనే చంపేసుకొన్నట్లు బాధపడుతూ కృష్ణమూర్తి గదిలోకి వెళ్ళింది— రైలుకి యింక అరగంటే టైముందని చెప్పడానికి.

వాసాలు లెక్కపెడుతున్న కృష్ణమూర్తి పార్వతి కేసి తిరిగాడు.

"తలంటుకున్నావా పార్వతీ ... ఆ జుట్టు చూడు" అన్నాడు చిలిపిగా.

"ఆ సంగతంతా మీ కలవసరం...రైలుకి అరగంటే టైముంది. నన్ను ఎక్కించివచ్చి పడుకుని వాసాలు లెక్కపెట్టండి."

"నువ్వు ఎక్కడికీ వెళ్ళడంలేదు."

"ఏం? ఎందుకూ? నేవెళ్ళిపోతాను. యిక్కడ ఒక్కరోజుకూడా వుండను." పార్వతి స్వరం అప్పుడే మారిపోతూంది.

"ఇక్కడ కాకుంటే—యింతమంది స్నేహితురాళ్లున్నారు...కమలా విమలా తులసీ ఎవరి దగ్గరో ఒక నాలుగు రోజులు వుండిరా పోనీ..." నవ్వుతూనే అన్నాడు కృష్ణమూర్తి.

"స్నేహితుల యిళ్ళలో వుండడం ఏంఖర్మ! నే నాయింటికే పోతాను" కోపంతో మండి పడి పోతూ అంది పార్వతి.

"అయితే యికనేం? యిక్కడేవుండు. ఆ తల సరిగా దువ్వేసుకో—ఏ సినిమాకేనా పోదాం" ప్రశాంతంగా అన్నాడు కృష్ణమూర్తి.

"నాకేం అవసరంలేదు. నన్ను యింటికి పంపిస్తే సరేసరి. లేకుంటే యీ క్షణంనుండీ మీకూ నాకూ ఏం సంబంధంలేదు." మూతి విరుచుకుంటూ పార్వతి లోపలికి వెళ్ళిపోయింది.

పార్వతి అలా వెళ్ళిపోగానే కృష్ణమూర్తి మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. పెళ్ళికాని క్రితం నుంచీ పార్వతిని బాగా ఎరుగును కృష్ణమూర్తి. పార్వతి ఎప్పుడూ యింతే. చిన్నమాట పట్టింపులని కొండంతలుగాచేసి తనూ బాధపడుతుంది. ఎదుటి వాళ్ళనీ బాధపెడుతుంది. ఎప్పుడూ తనే గెలవాలంటే ఎలాగ? కృష్ణమూర్తి ఒక నిశ్చయానికి వచ్చాడు: ఏమయినా సరే — వారంకానీ—పది రోజులుకానీ — పార్వతి కోపంతో మాట్లాడక పోయినా పుట్టింటికి మాత్రం పంపకూడదు అని.

ఈ నిశ్చయం తెలుసుకుందుకు ఆట్టేసేపు పట్టలేదు పార్వతికి. ఎనిమిదీ ఎనిమిదిన్నర అయినా కృష్ణమూర్తి లేవకుంటే— అంతా అర్థమైంది పార్వతికి. అందుకే వంటయింట్లో గిన్నెలూ చెంబులూ రణగొణ ధ్వని చేస్తున్నాయి. అదంతా వింటూకూడా కృష్ణమూర్తి తన నిశ్చయాన్ని మార్చుకోలేదు; సరికదా అదంతా వింటూంటే అతని నిశ్చయం బలిష్టం అయింది. త్వరగాలేచి బట్టలు వేసుకొని పేకాటకి స్నేహితుని యింటికి వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి. అతను వెళ్ళడం చూసింది పార్వతి. ఉడుకుబోతుతనంతో ఏడుపు ఆగలేదు పార్వతికి. ఎంతటి కఠినుడు; యితన్ని నే నెలా పెండ్లాడ్డానికి ఒప్పుకున్నాను? యిదంతా నాఖర్మ! అనుకుంది. వండినవంట అలాగే వదిలేసింది. నూకాలుని పిలిచి అయ్యావస్తే కొంచం భోజనం దగ్గరచూడు అని చెప్పి వెళ్ళి పడుకుంది పార్వతి. పడుకొంది అన్న మాటేగాని పార్వతికి మనశ్శాంతి లేదు. ఈ కృష్ణమూర్తితో చీటికీ మాటికీ దెబ్బలాడుతూ ఎలాగ బ్రతకడం? అని ఆలోచించడం మొదలుపెట్టిన పార్వతికి ఒకదరి చేరేసరికి తనదే తప్పేమో అనిపించింది. కృష్ణమూర్తి స్వతహాగా సరదాఅయినాడు. అన్నింటికీ సులభంగా నవ్వేస్తాడు: వేళాకోళం చేస్తాడు. ఆమాత్రానికి యింతకోపం తెచ్చుకోవడం తనదే తప్పేమో, ఈ ఆలోచనరాగానే పార్వతికి దుఃఖం ఆగలేదు; కాని ఎలాగ తనంతటతనే వెళ్ళి అతనితో మాట్లాడడం? నేనీ జన్మలో మీతో మాట్లాడను' అని అనకపోయినా అలాంటిదే అందేతను?!... కొంచంసేపు యీ ఆలోచనలు చల్లబడగానే పార్వతికి తిరిగి ధైర్యం వచ్చింది; బాగా చీకటిపడ్డా కృష్ణమూర్తి వస్తాడు, తనని పలకరిస్తాడు; మళ్ళీ యిద్దరూ మామూలే. అనుకుని పడుకుంది పార్వతి. అయినా పార్వతికి సరిగా నిద్రరాలేదు...మగత నిద్రలోనే కృష్ణమూర్తి యింటికి వచ్చినదీ, నూకాలు వడ్డిస్తూంటే సుష్టి పూర్తిగా భోజనం ముగించినదీ, హాయిగా హాల్లో పడకకుర్చీలో పడుకుని పత్రికలు తిరగవేస్తున్నదీ- అంతా తెలుస్తూనేవుంది; కృష్ణమూర్తివచ్చి తనని పలుకరించలేదనేసరికి పార్వతి పశ్చాత్తాపంరోంతా మాయమయింది. తనుపోయి పలకరించనిదేయిక కృష్ణమూర్తి మాట్లాడడని తెలుసు. అయినా తనలా చేయలేదు...

ఆరాత్రి పార్వతిని అనేక వూహాలు చుట్టుముట్టాయి. ఆవూహాలమధ్య ఆమెకో కలవచ్చింది. తమ యింటికి కృష్ణమూర్తి ఎవరో కొత్తవాడిని

తీసుకువచ్చినట్టు కలకంది పార్వతి. తెల్లవారి లేచాక ఆకలగురించి పూర్తి వివరాలు జ్ఞాపకం లేకపోయినా, పార్వతి కొన్ని సంగతులు మాత్రం మరిచిపోలేకపోయింది. కలలో కృష్ణమూర్తి తీసుకు వచ్చిన కొత్తవాడు... నీటిమీద తేలియాడుతూ కొన్ని వేలమైళ్ళు ప్రయాణంచేసి వచ్చినట్లూ, తనకోసమే వచ్చినట్లూ చెప్పాడు. అతనలా చెప్తూంటే కృష్ణమూర్తి కనుకొసలనుంచి పార్వతిని చూస్తున్నాడు. అదిచూసి కృష్ణమూర్తి ని బాగా ఏడిపించాలనుకొంది. అందుకే అతనున్న నాలుగురోజులూ అతనితో అతి చనువుగా మసులుతూ కృష్ణమూర్తి ఏమనుకుంటున్నాడో గమనిస్తూంది పార్వతి. కాని కృష్ణమూర్తి తనవంకేనా చూడ్డంలేదు. ఆ కొత్తమనిషి వచ్చి అయిదురోజులయింది. ఆనాటి రాత్రి భోజనాలయాక పార్వతి వెళ్ళి పడుకుంది. కాని కాస్సేపటికి కిందనేదో చప్పుళ్లు వినిపించి పార్వతి పరుగెత్తుకొని వచ్చింది. హాలు తలుపులు వేసివున్నాయి. పార్వతికి కాళ్ళు వణికాయి. ఎలాగో ధైర్యం తెచ్చుకొని తలుపు తెరచింది. చూస్తే— కృష్ణమూర్తి వెల్లకితలా పడివున్నాడు. అతనిలో చలనంలేదు. ఆ కొత్తమనిషి పార్వతి చెయ్యిపట్టుకుని "నేనే చంపేశాను. మనిద్దరం వెళ్ళిపోదాం నడు"అంటూ అలా నీటిమీద నడిపించుకుపోతున్నాడు... పార్వతి భయంతో ఒణికిపోతూ నిద్రలేచింది, పక్కని కృష్ణమూర్తి లేడు. గబగబ కిందికివెళ్ళి చూసింది: కృష్ణమూర్తి పడకకుర్చీలో పడుకుని హాయిగానిద్రపోతున్నాడు. మనస్సు కొంచెం కుదుటపడింది పార్వతికి.

తీరుబడిగా కూర్చుని తనకి వచ్చిన కలనిగురించి ఆలోచించసాగింది పార్వతి. వాస్తవానికి అతి సన్నిహితంగా వున్న ఆ కల ఎంతో నచ్చినట్లయింది పార్వతికి... ఆ కల, కలలో కొత్తమనిషీ, పార్వతిని వెన్నంటేవున్నారు... తీరుబడిగా గడపని ఆనుకుని కూర్చునివున్న పార్వతిని చూశాడు కళ్లు తెరిచీ తెరవగానే కృష్ణమూర్తి. "ఏం పార్వతీ, బాగా నిద్రపట్టిందా?" చిలిపిగా నవ్వుతూ అడిగాడు. అన్నీ మరిచిపోయి పార్వతి ఒకసారి నవ్వుదామను కుంది. కాని మనసొప్పలేదు. మూతి విరువకుండా వుండలేకపోయింది. అంతేకాదు. లేచి యింట్లోకి వెళ్ళిపోయింది. ఆమె వెనకాలే వంటయింటిలోకి వెడుతూ అన్నాడు కృష్ణమూర్తి, "సరేలే అమ్మాయి, నీకలాంటి ఆటఆడాలని ఉంటే నాకేం అభ్యంతరం లేదు. కాని పరాయివాళ్లున్నప్పుడు మనం సవ్యంగా వుందాం. ఎవరూ లేనప్పుడు నీదారి నీది, నాదారి నాది. సరేనా?" అంటూ పార్వతి ముఖమేనా చూడకుండా ముఖంకడుక్కుందుకి వెళ్లిపోయాడు కృష్ణమూర్తి. మంచి అవకాశం పోగొట్టుకున్నానని బాధపడ్డ పార్వతి అన్నీ సర్దుకోకపోతాయా అన్న ధైర్యంతో వూరుకుంది.

నాల్గురోజులు గడిచాయి. ఆనాటి సాయంత్రం ఒక కొత్తమనిషిని వెంటబెట్టుకుని వస్తూన్న కృష్ణమూర్తిని చూసింది పార్వతి. పార్వతి గుండె ఏదో అజ్ఞాతభయంతో దడదడలాడింది. కొంపతీసి తన కల నిజమౌతుందా? అన్న భయం ఆమెని పూర్తిగా వశపరచుకుంది.

కృష్ణమూర్తి ఉత్సాహం చూస్తే పార్వతికి అతనిమీద కోపం ఎక్కువయిందేకాని తగ్గలేదు. "ఏంమనిషి? యితనంటే నాకు అసహ్యంవేస్తూంది" అని చెప్పుకొంది పార్వతి... రాత్రి భోజనాలు కాగానే పార్వతి తనకి ఒంట్లో అస్వస్థతగా వుందంటూ వెళ్ళి పడుకుంది. పడుకొంది అన్నమాటేగాని తనకి వచ్చిన కలని మరిచిపోలేకుండా వుంది. ఏ క్షణాన ఆ కల నిజమౌతుందో అన్న భయం ఆమెని కృంగతీస్తూంది. ఆమె యీ ఉద్రిక్త పరిస్థితి కృష్ణమూర్తి గుర్తించకపోలేదు. ఈ దెబ్బలాట ఆమెనెలా కృంగతీస్తూందో అతనికి తెలుసు. ఇంకోరోజేనా గడవకుండానే పార్వతి తన పరాజయాన్ని ఒప్పుకుంటుంది. 'అలా జరగాలి. అప్పుడే కొంచెం యింగిత జ్ఞానమేనా ఒంటపడుతుంది పార్వతికి!' అన్నట్లు వూరుకున్నాడు కృష్ణమూర్తి. పార్వతికీ తెలుసు—కలలన్నీ శుద్ధ అబద్ధాలని; వాటిని నమ్మడం హాస్యాస్పదం అనీ తెలుసు. అయినా ఎందుకో ఆమెకి భయంగానే వుంది. అలా కళ్లుమూసుకునిపడుకునే పార్వతి దేనికోసమో ఏకాంతంగా భయంతో ఒణికిపోతూ ఎదురు చూస్తూంది: ఆ ఎదురుచూడ్డం ఎంతకాలం జరిగిందో తెలియదు. కాని ఏదో అర్థంకాని చప్పుళ్ళు విని ఉలిక్కిపడి లేచి నుంచుంది. కల నిజమయే సమయం వచ్చినట్లే అనిపించింది

పార్వతికి, తనకి తెలియకుండనే గట్టిగా నూకాలుని కేకేసింది. కింద గదిలోంచి నూకాలు ఒక్క ఉదుటునవచ్చింది. "ఏమమ్మా అలావున్నావేం? వంట్లో ఎలాగుంది" అంటూ ఒణికిపోతూ నించుని ఉన్న పార్వతిని పట్టుకు కూర్చోపెట్టింది.

"నూకాలూ, ఏమిటా చప్పుడు? అయ్య ఎక్కడ?" గుక్కతిప్పుకోకుండా అడిగింది పార్వతి. పార్వతి హడావిడికి నూకాలుకి నవ్వువచ్చింది.

"ఎందుకమ్మా అంతభయం. కిందికిరా చూద్దు గాని, అయ్యావారిస్నేహితుడూ కుస్తీపడుతున్నారు. కుర్చీలూ అవీ పక్కకి తోసేశారు" అంటూ ఇంకా నవ్వుతూనేవుంది: ఆ సందట్లో పార్వతి స్పృహతప్పి పడిపోవడం నూకాలు చూడలేదు. తీరా చూసేసరికి భయంవేసింది.

పార్వతిస్మృతితప్పి పడిపోయిందనగానే భయంతో త్వరగా పైకివచ్చాడు కృష్ణమూర్తి. పార్వతిని మంచంమీదికి చేర్చి ముఖాన నీళ్ళూ అవీ జల్లాడు. కొత్తమనిషి వీధిలోకి పరుగెత్తాడు సోడా ఏనా తెద్దామని. పార్వతికళ్లు తెరిచింది. కళ్ళు తెరవగానే కృష్ణమూర్తి ముఖం కనిపించింది. అతనికళ్ళు ఎంతో ఆందోళన సూచిస్తూన్నాయి. పార్వతికి దుఃఖం ఆగలేదు. కృష్ణమూర్తి చేతులు గట్టిగా పట్టుకుని ఒణికే కంఠంతో అడిగింది. "ఇక మనం మళ్ళీ స్నేహితులమేనా? నువ్వు యింకెప్పుడు నాతో మాట్లాడకుండా ఉండనని ఒట్టెయి." అంటూ అమాయకంగా చెయ్యి జాచింది పార్వతి.

"చూడు పార్వతీ ఎవరు మాట్లాడ్డం మానేశారు? అది సరేకాని, ఎందుకలా అయిపోయావు? ఒంట్లో సుస్తీగావుంటే నాతో కాకుంటే ఎవరితో చెప్తావు!" అని రేగిన ముంగురులు సద్దుతూ కృష్ణమూర్తి అడుగుతుంటే, పార్వతికి దుఃఖం పొంగి పొరలి వచ్చింది. ఆ దుఃఖంలోంచే అడిగింది.

"కిందని ఏంచేస్తున్నావు?"

"నీకు తెలియదా పారూ? నేనూ జగ్గాయి కుస్తీ పట్టి చూస్తున్నాం. ఎన్నాళ్లో అయింది మేం ఇద్దరం కుస్తీపట్టి. వాడు ఛాంపియన్. తెలుసా?

'నేనొకటి అడుగుతాను చెప్తావా?"

"అడుగూ." అన్నాడు కృష్ణమూర్తి. "నేచెప్పినట్లు చేస్తానని ఒట్టెయి." అంటూ తిరిగి చెయి జాపింది పార్వతి.

"ఇంతటి సత్తువలేని శత్రువు నా కొద్దు. నువ్వు చెప్పినట్టే." అంటూ పార్వతిచేయి తన చేతిలోకి తీసుకున్నాడు కృష్ణమూర్తి.

"ఈవాళకి కుస్తీవద్దు. మాట్లాడకుండా వచ్చి పడుకో. నా కెందుకో భయంగావుంది." అని చెప్పేసి ఒణికిపోతూన్న పార్వతిని చూసి కాదన లేకపోయాడు కృష్ణమూర్తి.

పార్వతి ఆరాత్రి కృష్ణమూర్తికి తన కలని గురించి చెప్పింది. పార్వతి పిరికితనానికి కృష్ణమూర్తి నవ్వుకున్నాడు.

తెల్లవారి లేవగానే స్నేహితుడు అడుగుతున్నాడు 'ఏరాభాయి కుస్తీగిస్తీ అంతా మానేసి ఒదినగారి సేవలో పడిపోయావు రాత్రి!"

"ఏంలేదు జగ్గా, పార్వతీ నేనూ నాలుగు రోజులనుంచి మాట్లాడుకోడంలేదు." మొదలు కొని పార్వతి కలదాకా అంతా చెప్తూ "జగ్గాయి! నిజంగా నువ్వు నన్ను చంపేయడానికి వచ్చావను కుంది పార్వతి!" అంటూంటే కొత్తమనిషి విరగబడి నవ్వుతున్నాడు. అప్పుడే దిగివస్తూన్న పార్వతికి చచ్చేంత సిగ్గేసింది వాళ్ళనవ్వుచూసి. పార్వతిని చూసిన కొత్తమనిషి

"మీ ఒంట్లో ఇప్పుడు ఎలాగుంది వదినగారూ" అంటూ చిరునవ్వుతో పలకరించాడు.

"పార్వతీ మనవాడికి యిద్దరు పిల్లలూ ఒక రంభలాంటి చెప్పినమాటవినే పెళ్ళామూను. అంచేత నువ్వు ధైర్యంగా వుండు" అంటూ స్నేహితుడికేసి తిరిగాడు కృష్ణమూర్తి.

"అయినాఅంతపిరికితనం గూడదు వదినగారూ, కొంచంగయ్యాళిగావుంటేగాని కృష్ణుడులొంగడు" సలహాయిచ్చాడు స్నేహితుడు.

అంతా సద్దుమణిగి ప్రశాంతంగా యిల్లువున్నా పార్వతికి లోలోన ఏదో సంతోషం భయంకూడా పీడిస్తూనేవుంది. ఆరాత్రే కనక తను కృష్ణని పిలవక పోతే ఏమయి వుండేది? అన్న సమాధానం దొరకని ప్రశ్న—అనుమానాలకి యిట్టే వశమయి పోయే పార్వతి చిన్న మెదడుని యాతన పెడుతూనేవుంది.